రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్
- జిల్లా కోర్టుల్లో 2,05,000 కేసులు పరిష్కారం
- హయత్‌నగర్ కోర్టులో 6,057 కేసులు రాజీ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ బెంచీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులను సెటిల్ చేసుకోవడం ద్వారా సివిల్ కేసులలో చెల్లించిన కోర్టు ఫీజులు తిరిగి పొందవచ్చన్నారు. ఆస్తిపరమైన కేసులు, కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్‌అదాలత్‌లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరువర్గాలు గెలిచినట్లేనని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ప్రాంగణాలలో 22 లోక్‌అదాలత్ బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్‌బౌన్స్‌కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్స్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకున్నారని తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్‌బౌన్స్‌కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్స్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులన్నీ కలిపి సుమారు 2,05,000పై చిలుకు కేసులు పరిష్కరించబడ్డాయన్నారు. అన్ని కేసులలో రూ.5,24,82,919ల నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగిందన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న హయత్‌నగర్ కోర్టు జడ్జి సల్మాఫాతిమా

హయత్‌నగర్ కోర్టులో..

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లోని 14వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. కోర్టు జడ్జి సల్మాఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 6,057 కేసులను కక్షిదారులు రాజీ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి సల్మాఫాతిమా మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకోవడమే మంచిదని అన్నారు. కోర్టుల చుట్టూ తిరగం వల్ల సమయం వృథాతో పాటు డబ్బులు ఖర్చు అవుతాయని అన్నారు. అంతే కాకుండా విలువైన సమయం వృథా అవుతుందన్నారు. ఇంకా ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ కుదుర్చుకోవాలని కక్షిదారులను కోరారు. కార్యక్రమంలో 7వ మెట్రోపాలిటన్ కోర్టు ఇన్‌చార్జి నర్మద, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లావణ్యకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, బెంచి సభ్యులు సంతోష్‌గౌడ్, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, వనస్థలిపురం సీఐ మహేష్‌గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.


జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీకుదుర్చుకున్న కక్షిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్


పసుమాములలో మొక్క నాటుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తదితరులు

పర్యావరణ పరిరక్షణ కర్తవ్యంగా భావించాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక చెట్టు' కార్యక్రమాన్ని శనివారం ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ గూడెపు మధుగౌడ్, రాష్ట్ర నాయకుడు పిల్లి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పసుమాములలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం వెళ్లే రోడ్డులో పార్టీ నాయకులతో కలిసి వెంకటేశ్వర్లు మొక్కలను నాటారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ పేరుతో ఒక చెట్టును నాటి పెద్దది అయ్యే వరకు సంరక్షించాలని సూచించారు. ఆ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ కొత్త అశోక్‌గౌడ్, కల్లెం బాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, జగన్‌ముదిరాజ్, కందాళ బల్‌దేవ్‌రెడ్డి, షకిల్‌మిర్జా, సత్యనారాయణ, శ్రీనివాసరావు, అంబేడ్కర్, సాయి, సురేష్, శ్రీహరి, హరిబాబు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్ పరిధిలోని మూసారాంబాగ్ బస్తీ వాటర్ ట్యాంక్ నుంచి సాయినగర్‌కాలనీ పోచమ్మ ఆలయం వెనుక వైపు వరకు సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.21లక్షలను వెచ్చిస్తున్నట్లు వివరించారు. మూసారాంబాగ్ బస్తీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం జీహెచ్‌ఎంసీ ద్వారా అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందు, బాబురావు, సంపత్, స్వామి, అశోక్, దేవేందర్, సురేందర్, నవీన్, అండాలు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు లేకుండా అమ్మితే చర్యలు

ఓల్డ్‌మలక్‌పేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులు అమ్మితే చట్టపరమైన చర్యలుంటాయని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ఆయన మాట్లాడుతూ జాంబాగ్ పరిధిలో తనిఖీలు చేయగా 19మంది ట్రేడ్‌లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందని వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ ప్రకటిత ఏరియాల్లో మార్కెటింగ్‌శాఖ సరుకులు అమ్ముకోవాలన్నా, వ్యాపారం చేసుకోవాలన్నా తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్న ఉపమార్కెట్‌లలో సైతం నిబంధనలు పాటించాలని తెలిపారు.


హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి నర్సింహారెడ్డి



వందసార్లకు పైగా రక్తదానం చేసిన దయాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న కామినేని ఆస్పత్రి బృందం

కామినేనిలో రక్తదాన శిబిరం

మన్సూరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆస్పత్రి బ్లడ్ సెంటర్ హెడ్ డాక్టర్ వివేకానంద విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వంద మందికి పైగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది రక్తదానం చేయగా ఎక్కువసార్లు రక్తదానం చేసిన వలంటీర్లను ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది. వందసార్లకు పైగా రక్తదానం చేసిన దయాకర్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పునీత్‌బాబు, మార్కెటింగ్ గ్రూప్ హెడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విమాన ప్రమాద ఘటన మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

విమాన ప్రమాద మృతులకు నివాళులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని పెద్దఅంబర్‌పేట్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధ్యక్షుడు పిల్లి బాలమల్లేష్‌యాదవ్, సాధు శ్రీనివాస్‌ముదిరాజ్, సిద్దంకి జగన్‌మోహన్‌రెడ్డి, గంట ప్రభాకర్‌రెడ్డి, పర్వత్ బాల్‌రెడ్డి, ధన్‌రాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్తపేట : రెండో శనివారం సెలవు రోజు కావడంతో కొత్తపేటలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రధాన వేంకటేశ్వరాలయం, విజయ వినాయక స్వామి, విశాలాక్షీ అన్న పూర్ణాదేవి సమేత విశ్వనాథ ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, ప్రసన్నాంజనేయస్వామి తదితర ఉపాలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలూ చేయించారు. అదేవిధంగా ఎస్ఆర్ఎల్‌కాలనీలోని శ్రీరామ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, కొత్తపేట పురాతన భక్తాంజనేయస్వామి ఆలయం, ఎస్‌బీహెచ్‌కాలనీలో, సత్యానగర్‌కాలనీల్లో గల ఆలయాల సముదాయం హరిహరక్షేత్రంలోనూ పూజలకు భక్తులు హాజరయ్యారు.


ఆలయం వద్ద భక్తులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే దేవిరెడ్డి

మన్సూరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పర్చడమే నా లక్ష్యమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీ కమ్యూనిటీ హాలులో పరిసర కాలనీ అసోసియేషన్ల సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకి వారు సమస్యలను విన్నవించుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లో కారణంగా చిన్నపాటి వర్షాలకే అవి పొంగిపొర్లుతున్నాయని, వాటిని మెరుగు పర్చాలని కోరారు. రాత్రి వేళల్లో కొందరు అల్లరిమూకలు రోడ్లపై గంజాయి సేవించి స్థానికులతో పాటు అటుగా రాకపోకలు సాగించే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. లక్కీ రెస్టారెంట్ వద్ద అక్రమ పార్కింగ్‌లు పెట్టడంతో కాలనీల్లోకి రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సాయినగర్‌కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాలులో నీటి కొరత ఉందని బోరు వేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రమాదకర విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేయించాలని, జనాభా సామర్థ్యానికి తగ్గట్టుగా గతంలో వేసిన మంచినీటి పైప్‌లైన్ స్థానంలో ఎక్కువ సామర్థ్యం గల పైప్ లైన్ వేయించాలని, అలాగే కొన్ని కాలనీల్లో రోడ్లపై కొందరు వ్యాపారాలు చేస్తున్నందున తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. నెలకొన్న ప్రతీ సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని, పోలీసు అధికారులతో మాట్లాడి కాలనీల్లో పోలీసుల గస్తీ పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాయకులు గవ్వ శ్యాంసుందర్‌రెడ్డి, వివిధ కాలనీ అసోసియేషన్ల సభ్యులు యుగేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటట్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు, గోపాల్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

'గద్దర్ సినీ అవార్డ్సను వ్యతిరేకించడం సిగ్గుచేటు'

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గద్దర్ సినీ అవార్డ్సను బీజేపీ నాయకులు వ్యతిరేకించడం సిగ్గుచేటని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ఫౌండర్, ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ విమర్శించారు. శనివారం ఆయన ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ వేదికగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం తమ జీవితాంతం పోరాడిన కవులు, కళాకారులు, మేధావులను గత ప్రభు త్వం విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తించి సముచిత గౌరవం ఇస్తోందని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమంలో తన ఆట, పాట, మాటతో బలహీనవర్గాల గొంతుకగా నిలబడ్డ తెలంగాణ కళారూపాల వేగుచుక్క గద్దర్ పేరు మీద సినీ అవార్డ్సను సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సినిమా పరిశ్రమతో గద్దర్‌కు సంబంధం ఉందని, ప్రతిష్ఠాత్మక మా భూమి సినిమా, ఒరేయ్ రిక్షా, జై బోలో తెలంగాణ వంటి సినిమాలకి పాటలు పాడి, రచించిన ఆయన సేవలకు గానూ గతంలో నంది అవార్డు, ఉత్తమ నేపథ్య గాయకుడి అవార్డును కూడా సినీ పరిశ్రమ అందించిందని గుర్తు చేశారు. నరేంద్ర మోదీ క్రికెట్‌లో ఎన్ని సెంచరీలు చేశాడని, ఆయన బతికుండగానే గుజరాత్‌లో స్టేడియానికి మోదీ పేరు పెట్టారని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి, గద్దర్ అభిమానులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న టీఎస్‌పీ జేఏసీ ఫౌండర్ వలిగొండ నరసింహ

నేడు యూనివర్సల్ మీడియేషన్ సెంటర్ ప్రారంభం

చాదర్‌ఘాట్ : మలక్‌పేటలోని లూయిస్ బ్రెయిలీ పార్క్ ఆవరణలో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ డిసెబుల్డ్ (ఫెడ్ స్వచ్ఛంద సంస్థ) ఆధ్వర్యంలో ఆదివారం సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ సలహాలతో యూనివర్సల్ మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. హైకోర్టు న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావు, టీఎల్ఎస్ఏ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరీ, జీఎల్ఎస్ఏ మెంబర్ సెక్రెటరీ కిరణ్‌మయిల చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం ప్రారంభోత్సవం చేయిస్తున్నట్లు ఫెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం తెలిపారు. యూనివర్సల్ మీడియేషన్ సెంటర్ ద్వారా నిరుపేదలు, అన్ని రకాల దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు న్యాయ సహాయం పొందేందుకు ఉచితంగా ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం ద్వారా రాజీపరచి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తుందని వివరించారు. దేశవ్యాప్తంగా పేరుకుపోతున్న కేసుల సంఖ్య తగ్గించడానికి, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ద్వారా ఈ కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పంచాయతీ ఎన్నికల బరిలో సీపీఐ : రవీంద్రాచారి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): త్వర లో జరుగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన అభ్యర్థులు బరిలో ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి వెల్లడించారు. శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాల్లో పార్టీ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డితో కలిసి రవీంద్రాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పార్టీ బలం ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థితో పాటు వార్డు సభ్యుడిని పోటి చేయించనున్నట్లు చెప్పారు. అందుకోసం పోటీ చేయదలచుకున్న వారు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను కష్టపడి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభల ఇన్‌చార్జి వేణుగోపాల్‌చారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, మండల నాయకులు లక్ష్మణ్, రాము, బాలయ్య, చెన్నయ్య, యాదయ్య, బచ్చయ్య పాల్గొన్నారు.



సీపీఐ శాఖ మహాసభలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

గంజాయి విక్రేత అరెస్ట్


హైదర్‌నగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద 1,100 గ్రాముల ఎండు గంజాయి, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన లోకేశ్ బోరబండలో నివాసం ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎక్కువగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో గంజాయి అమ్మాలని నిర్ణయించుకున్నాడు. అందుకు మహారాష్ట్రలోని పర్భాని ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్నాడు. శుక్రవారం రాత్రి హైదర్‌నగర్ రెయిన్ బో ఆస్పత్రి సమీపంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా.. నమ్మదగిన సమాచారం మేరకు కేపీహెచ్‌బీ ఎస్ఐ రూప, తన సిబ్బందితో కలిసి గంజాయి విక్రయిస్తున్న లోకేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 1,100 గ్రాముల ఎండు గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు లోకేశ్‌ను రిమాండ్‌కు తరలించారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చంపాపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీలో పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీడీఎల్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా చాదర్‌ఘాట్ నుంచి బాలాపూర్ వైపు టీజీ 12టి 2677అశోక్ లీలాండ్ వాహనంలో 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా వారు పట్టుకున్నారు. బండ్లగూడ పీఎస్ డీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి డ్రైవర్ రూపన్ సహానీని అదుపులోకి తీసుకొని వాహనాన్ని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వారు తెలిపారు.

గృహిణి అదృశ్యం

హయత్‌నగర్ : మనుమరాలిని కూతురు ఇంటి వద్ద వదిలి వెళ్లడానికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ సూర్యవంశీకాలనీలో నివాసం ఉండే సంపంగి తిరుపతమ్మ(55) గురువారం రోజున రాత్రి 10గంటలకు అదేకాలనీ శివారులో ఉండే కూతురు ఇంటి వద్ద మనుమరాలిని వదిలివెళ్లడానికి వెళ్లింది. మనుమరాలిని వదిలిపెట్టిన తిరుపతమ్మ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తిరుపతమ్మ గురించి చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. తిరుపతమ్మకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. తిరుపతమ్మ భర్త తిరుపతయ్య శుక్రవారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తిరుపతమ్మ


హమాలీలతో మాట్లాడుతున్న మార్కెట్ ఎస్‌జీఎస్ నర్సింహారెడ్డి

హమాలీలు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

ఓల్డ్‌మలక్‌పేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలు, చాటకార్మికులు విధిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి సూచించారు. శనివారం మలక్‌పేటలోని మార్కెట్ కార్యాలయంలో కార్మికులతో, కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వం నుంచి కార్మికులకు లభించే ప్రయోజనాల గురించి వివరించారు. మార్కెట్‌లో ప్రతిరోజు 550 మంది హమాలీ, చాటకార్మికులు పనిచేస్తున్నారని వారందరు గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. మార్కెట్‌కు పంటను తీసుకువచ్చే రైతులు గుర్తుపట్టే విధంగా కార్మికులకు డ్రెస్‌కోడ్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల చివరి కల్లా ఎస్‌జీఎస్ కార్యాలయంలో గుర్తింపు కార్డులు తీసుకోవాలని అలాగే ప్రతి ఒక్కరూ డ్రెస్‌కోడ్ పాటించాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ గ్రేడ్ 3 కార్యదర్శి పుష్ప, సూపర్‌వైజర్ పవన్ పాల్గొన్నారు.

బీజేపీ డివిజన్ కమిటీ నియామకం

చంపాపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ చంపాపేట డివిజన్ నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. డివిజన్‌లోని కర్మన్‌ఘాట్‌లో శనివారం పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హాజరై డివిజన్ కమిటీ నూతన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. డివిజన్ ఉపాధ్యక్షులుగా రజిత, జి.శ్రీనివాస్‌రెడ్డి, జె.జనార్దన్‌రెడ్డి, డి.జనార్దన్, ప్రధాన కార్యదర్శులుగా బి.యోగిరాజ్, ఆకుల శ్రవణ్‌కుమార్, కార్యదర్శులుగా కవిత, నరేందర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, వేణుగోపాల్, కోశాధికారిగా శ్రీకాంత్, శ్రీధర్‌గౌడ్‌లను నియమించినట్లు డివిజన్ అధ్యక్షుడు తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ లక్ష్య సాధనకు అంకితభావంతో పని చేయాలని ఆయన నూతన కమిటీ సభ్యులను కోరారు.


సమావేశంలో నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి